

ఆరోగ్య మస్తు!

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తున్న సంగతి తెలిసిందే. సంక్షేమం, అభివృద్ధి, విద్య, వైద్యం ఇలా ఒకటి కాదు అన్ని విధాలుగా పేదల కోసమే పాటుపడుతున్నారనడంలో ఏమాత్రం సందేహం లేదు. ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తూ మెరుగైన వైద్యం, వైద్య సదుపాయాలు అందించాలనే ఉద్దేశంతో ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఖరీదైన వైద్యాన్ని పేదలకు చేరువ చేశారు.

- ప్రజారోగ్యానికి సీఎం జగన్ పెద్దపీట
- 53వ వార్డు శివనగర్‌లో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు
- కోటి రూపాయల వ్యయంతో నిర్మాణం
- పేదలకు చేరువగా వైద్య సేవలు



53వ వార్డు శివనగర్‌లో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న టెక్నీషియన్ మధు

మద్రిపాలెం: ప్రజారోగ్య పరిరక్షణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఈక్రమంలోనే డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అన్ని వసతులు.. ఆధునిక హంగులతో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెం శివనగర్‌లో ప్రభుత్వం గతేడాది సుమారు కోటి రూపాయల వ్యయంతో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించింది. దీనిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చేతుల మీదుగా ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ హెల్త్ సెంటర్ స్థానిక ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలందిస్తోంది.



ఆరోగ్య కేంద్రంలో ఫార్మసీ వద్ద క్యూలో మందులు తీసుకుంటున్న రోగులు

ఇవీ వైద్య సేవలు..

- శివనగర్ ఆరోగ్య కేంద్రంలో సాధారణ వైద్యంతోపాటు పీడియాట్రిక్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పల్మనాలజీ, డెర్మటాలజీ వంటి పలు వైద్య సేవలు అందిస్తున్నారు.
- 64 రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు.



ఓపీ గదిలో క్యూ పద్ధతిలో రోగులను చూస్తున్న ఆర్థోపెడిక్ డాక్టర్ శ్రీనివాస్

- వారంలో ప్రతి రోజూ ఒక స్పెషలిస్ట్ వైద్య నిపుణుడు రోగులకు అందుబాటులో ఉంటున్నారు.
- రోజుకు కనీసం 100 మంది వరకు ఓపీ నమోదవుతుంది.
- చికిత్స కోసం స్థానికుల కాక చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా వస్తున్నారు.
- వైద్యం చేయించుకున్న వారికి ఉచితంగా మందులు అందజేస్తున్నారు.

తగ్గిన దూరాభారం.. ఉచితంగా ఖరీదైన వైద్యం

గతంలో ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చినా ఎక్కడో వెళ్లి డబ్బు పెట్టి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఉచిత వైద్యం కావాలంటే కేజీహెచ్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఎప్పుడూ ప్రజా శ్రేయస్సును కోరుకునే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలను వెనువెంటనే ఏర్పాటు చేసి, ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలిచారు. ఖరీదైన వైద్యాన్ని రోగులకు ఉచితంగా అందజేస్తున్నారు. మెరుగైన వైద్యం ప్రజలకు మరింత చేరువ చేయాలనే సదుద్దేశంతో సీఎం తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెంతనే ఆరోగ్య కేంద్రంతో ఎంతో మేలు



నేను తొమ్మిది నెలలుగా ఈ ఆరోగ్య కేంద్రానికి వస్తున్నాను. ప్రతి నెలా బీపీ, సుగర్ చూపించుకుంటాను. పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు ఇస్తున్నారు. ఇక్కడ డాక్టర్లు బాగా వైద్యం చేస్తున్నారు. స్పెషాలిస్టులు కూడా వస్తున్నారు. మా ప్రాంతంలో ఆరోగ్య కేంద్రం ఉండటంతో ఎంతో ఉపయోగకరంగా మారింది.

– మేపాడ లక్ష్మి, శివనగర్

అందరికీ అందుబాటులో వైద్య సేవలు



ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా శివనగర్‌లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించారు. నేను నాలుగు సార్లు వచ్చాను. డాక్టర్లు ట్రీట్‌మెంట్ బాగా చేస్తున్నారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు కూడా ఇచ్చారు. ఇంత పెద్ద ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది.

– షేక్ మైమూద్, మసీద్ స్ట్రీట్, మద్రిపాలెం

క్లుప్తంగా

సత్వరమే పెండింగ్ అర్జీల పరిష్కారం



బీఎల్‌వోలకు సూచనలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ అఖిల

సీతమ్మధార: పెండింగ్‌లో ఉన్న ప్రజా అర్జీలను తక్షణం పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి డిప్యూటీ కలెక్టర్, ఉత్తర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.అఖిల ఆదేశించారు. సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లి డోర్ నంబర్లతోపాటు ఎంత మంది నివసిస్తున్నారో క్షుణ్ణంగా పరిశీలించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఓటర్లు ఉన్న చోట ఓటు హక్కు వినియోగంపై ఈవీఎంల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటా సేకరించిన వివరాలను తమకు అందజేయాలని చెప్పారు. తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్తికేయరెడ్డికి అభినందన



స్వర్ణం పతకం సాధించిన కార్తికేయరెడ్డిని అభినందిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: విశాఖ డిస్ట్రిక్ట్ అమంచ్యూర్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో 27, 30 కేజీల విభాగంలో పెన్ స్కూల్ విద్యార్థి కార్తికేయరెడ్డి స్వర్ణం పతకం సాధించాడు. ఈ సందర్భంగా సోమ వారం సీతమ్మధారలో విద్యార్థిని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అభినందించారు. ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి పిల్లలను అన్ని రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. అసోసియేషన్ సభ్యుడు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరావు, డి.నాగేశ్వరరావు నిర్వాహకులు ఎన్టీఆర్ రెడ్డి, మామిడి శ్రీనివాస్, నీలి రవి కార్తికేయరెడ్డిని ప్రశంసించారు.

క్యూఆర్‌లో సంభావన సమర్పయామీ..!

స్మార్ట్ విప్లవం వచ్చాక.. జీవన విధానాల్లో మార్పులెన్నో వచ్చాయి. డిజిటల్ పేమెంట్స్.. ప్రతి ఒక్కరి జీవితంలో భాగమయ్యాయి. చాక్లెట్ దగ్గరి నుంచి ఎలక్ట్రానిక్స్ కొనాలన్నా.. ప్రతి ఒక్కదానికీ డిజీ పేమెంట్స్‌పైనే ఆధారపడుతున్నారు. దైవ కార్యాలయాలకూ క్యూఆర్‌లే వినియోగిస్తున్నారు. హుండీలో కానుకలు వేసేందుకు డబ్బులు లేకపోతే.. నేరుగా దేవస్థాన అకౌంట్‌లో వెయ్యొచ్చంటూ రేసపువానిపాలెంలోని దుర్గాదేవి గుడి గేట్‌కు పేమెంట్స్ గేట్‌వే క్యూఆర్ కోడ్ అతికించారు. ద్వారకానగర్ శివాలయంలో కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారికి.. సంభావన ఇచ్చేందుకు డబ్బులు చేతిలో లేకపోవడంతో.. ఓ భక్తుడు ఇలా.. క్యూఆర్ స్కాన్ చేస్తూ.. దక్షిణ చెల్లిస్తుండటం విశేషం.



–ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సారిపిల్లి సంతోష్ నియామకం



సంతోష్‌కు నియామక పత్రం అందజేస్తున్న యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆనందరావు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సారిపిల్లి సంతోష్ నియమితులయ్యారు. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.ఆనందరావు సోమవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనందరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కింతాడ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రెల్లి సత్యం పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పూజా మహోత్సవాలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి రామచంద్రనగర్‌లోని రామలింగేశ్వరాలయంలో కార్తీక మాస పూజా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం ప్రత్యేక పూజలు, భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథులు ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకుడు తైనాల విజయ్‌కుమార్, ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు చేతుల మీదుగా అన్నదానం ప్రారంభించారు. ముందుగా శివాలయంలో వీరు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, ఆలయ కమిటీ సభ్యులు పైడి నాగరాజు, ముప్పిడి రామారావు, కొప్పిశెట్టి సిమ్మారావు, కొప్పిశెట్టి లక్ష్మణరావు, దారపు రమణ, టి.నాయుడు, పలిశెట్టి గణపతి, మట్ట సింహాచలం, పార్టీ నాయకులు హరిపట్నాయక్, ఆదిలక్ష్మి, కారుకొండ రాజు, చింతల బాబూరావు, సన్ని, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



అన్నసమారాధన ప్రారంభిస్తున్న తైనాల విజయకుమార్



రామలింగేశ్వరాలయ ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కె.కె.రాజు, పైడి రమణ

కాశీ విశ్వేశ్వరుడికి విశేష అభిషేకాలు

మద్రిపాలెం: కార్తీక మాస ఆఖరి సోమవారం కావడంతో 53వ వార్డు సాయినగర్ కాశీ విశ్వేశ్వరాలయానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. శివుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు అందుకూరి శివాజీశర్మ శాస్త్రోక్తంగా పూజలు జరిపించారని ఆలయ ఈవో పీఎస్ఎస్ మూర్తి తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



గాంధీనగర్-2 ఆలయంలో రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

13న అన్నసమారాధన

ఈ నెల 13న కాశీవిశ్వేశ్వరాలమంలో అన్నసంతర్పణ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.



సాయినగర్‌లో పూజలందుకున్న శివయ్య

- 51వ వార్డు గాంధీనగర్-2లోని పార్వతీ సమేత అమృత లింగేశ్వరస్వామి స్పటిక లింగ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. హరిహర క్షేత్రం యువ సేన సేవా సంఘం ఆధ్వర్యంలో అర్చకుడు జయంతి సూర్యశర్మ పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ నెల 13న అన్నదానం నిర్వహిస్తామని, భక్తులు పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

మార్మోగిన శివ నామస్మరణ

సీతమ్మధార: నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం భక్తుల శివ నామస్మరణ మార్మోగింది. అర్చకులు విశేష పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప షిర్డీసాయిబాబా దేవాలయానికి భక్తులు పోటెత్తారు. శివకేశవులకు ప్రత్యేక పూజలు చేశారు.

'స్పందన'కు 10 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 10 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.ఆనందకుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు.

వాకర్స్ క్లబ్ సేవలు శ్లాఘనీయం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు శ్లాఘనీయమని వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆమె ప్రసంగించారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పల్లా చంద్రమౌళి మాట్లాడుతూ ఈ ఏడాది తమ కార్యవర్గం ఆధ్వర్యంలో పార్కు సుందరీకరణ, మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో ఉత్తమ క్లబ్‌గా పురస్కారం పొందడానికి తమ సభ్యుల సహకారంతోనే సాధ్యమైందని చెప్పారు. వాకర్స్, సందర్శకులకు అనుకూల వాతావరణం కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ వాయిస్ డిసెంబర్ సంచికను పూర్వ అధ్యక్షుడు కేజీ కృష్ణారావు ఆవిష్కరించారు. ఉప్పలపాటి శుభ, వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్‌లను సత్కరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం, ఎం.శ్రీరామమూర్తి, క్లబ్ కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, కోశాధికారి జె.కూర్మారావు, పి.చెల్లారాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ శుభ

భక్తిశ్రద్ధలతో దీపారాధన



కార్తీక దీపారాధనలో పాల్గొన్న భక్తులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తాటిచెట్లపాలెం రెడ్డి వీధిలోని రామబాలభక్త సమాజం(శ్రీ సీతారామాలయం)లో సోమవారం కార్తీక మాస ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో దీపారాధన చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు బోర నర్సింగరావు రెడ్డి, నూనెల పోలారావు, బి.వరశంకరరెడ్డి, ఎస్.వెంకటేశ్వరరావు, జె.ప్రకాష్ పర్యవేక్షించారు.

ఆరోగ్య కార్యక్రమాలు వేగవంతం

మహారాణిపేట: అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. రేసపువానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఇతర కేసులు, ఆరోగ్యశ్రీ కేసులపై అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. దీనిపై సమాచారం ఉంటే ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్(డీఐవో) డాక్టర్ జీవన్‌రాణి మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనస్సు, చిన్న పిల్లలకు నిమోనియా, ఇతర వ్యాధుల మీద అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, ఆరోగ్యశ్రీ మేనేజర్ సత్య శ్రీనుబాబు, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఉమావతి, జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి జి.పూర్ణేంద్రబాబు, ఇతర వైద్యులు సత్యవాణి, తులసీ, శశిభూషణ్‌రావు, నాగభూషణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

పట్టుదలతో పనిచేస్తేనే ప్రగతి

సీతమ్మధార: ఏ రంగంలోనైనా పట్టుదలతో పనిచేస్తేనే ప్రగతి సాధించగలమని ఏపీఎస్ఈబీఆర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ చైర్మన్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన జాతీయ బాలల సమ్మేళనంలో పాల్గొన్న స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ బాలలను సోమవారం సీతమ్మధారలో సంఘ ప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంకితభావం, క్రమశిక్షణ, సాధన ఎంత అవసరమో.. పట్టుదల కూడా అంతే అవసరమన్నారు. ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని సాధన చేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. బాల భవన్ సొసైటీ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయ సమ్మేళనంలో పాల్గొన్న జనిత్ సంఘవి, బి.అనురాధ, బి.పూజిత చందన, బి.కమలాని శ్రీవర్ష బృందం మేనేజర్ కల్పనా సంఘవిలకు ముఖ్య అతిథి అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు. కొరియోగ్రాఫర్ నాగరాజు పట్నాయక్ రూపొందించిన వసుధైక కుటుంబం రూపకాన్ని బృందం ప్రదర్శించింది. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ జి.ఎస్.కె.ప్రసాద్, కార్యదర్శి సత్యరాజు, కె.రామారావు, గాయకులు రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.



బాలలను అభినందిస్తున్న అసోసియేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఇతర ప్రతినిధులు

కారు ఢీకొని మహిళ మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డివైడర్ దాటుతున్న మహిళను కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. విశాఖపట్నానికి చెందిన బోని పద్మ(38) కార్తీక సోమవారం అమ్మవారిని దర్శించుకునేందుకు భవానీపురం బాల భాస్కర్ నగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చింది. కార్తీక సోమవారం కావడంతో ఉదయం 5.15 గంటల సమయంలో పద్మ తన వదిన పైడి రాజమ్మతో కలిసి దుర్గగుడికి బయలుదేరింది. కనకదుర్గ ఫ్లై ఓవర్ వద్ద డివైడర్ దాటుతుండగా వేగంగా వచ్చిన కారు పద్మను ఢీ కొట్టింది. తలకు బలమైన గాయమై పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోయింది. దీనిపై మృతురాలి వదిన పైడి రాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతారామ కల్యాణం చిత్రంపై ప్రసంగం



ప్రసంగిస్తున్న రాంభట్ల నృసింహశర్మ

సీతమ్మధార: సాహిత్య సురభి సంస్థ ఆధ్వర్యంలో సోమ వారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సీతారామ కల్యాణం విందము రారండి(సీతారామ కల్యాణం చిత్రం)పై ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీ భూషణ రాంభట్ల నృసింహశర్మ ప్రసంగిస్తూ సర్వ పాత్రలను సమర్థంగా మలిచి, దర్శకుడిగా తనలోని ప్రతిభను ఆవిష్కరించిన నందమూరి తారక రామారావు ప్రజ్ఞకు కళా దర్పణం ఈ చిత్రమన్నారు. రావణ పాత్రలో ఎన్టీఆర్ అద్భుతంగా నటించారని కొనియాడారు. గాలిపెంచల నరసింహారావు సంగీతం సీతారామ కల్యాణం చిత్రానికి వన్నె తెచ్చిందన్నారు. వృద్ధుల కల్యాణ రామారావు సభాధ్యక్షుడిగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా సీనియర్ జర్నలిస్ట్ రమణ మూర్తి, ప్రత్యేక అతిథిగా డి.వి.సూర్యారావు హాజరయ్యారు. కార్యక్రమంలో ఓరుగంటి రాజరాజేశ్వరీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

మిస్టర్ విశాఖ బాడీ బిల్డింగ్ విజేత భాస్కరరావు

విశాఖ విద్య: మిస్టర్ విశాఖ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ విజేతగా గిడ్డి భాస్కర్ నిలిచారు. ఎస్‌పీడీ కరాస ఆర్కే ఫిట్నెస్ మంత్ర జిమ్స్‌లో సోమవారం సెకెండ్ మిస్టర్ విశాఖ కోస్టల్ బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్-2023లను నిర్వహించారు. పోటీలను పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 120 మంది పోటీదారులు పాల్గొన్నారు. చాంపియన్‌గా గిడ్డి భాస్కరరావు , బెస్ట్ మస్క్యులర్‌గా హేమంత్ కుమార్, బెస్ట్ పోజర్‌గా పాల్గొణరావు నిలిచారు. సబ్బవరం ఎంపీపీ, మధురం డెవలపర్స్ ఎండీ రాపేటి రాము, రాజాన నాయుడు, ఆదిత్య నాయుడు చేతుల మీదగా విజేతలకు బహుమతులను అందజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లా కృష్ణ, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్, జిమ్ నిర్వాహకులు గున్న రామకృష్ణారావు. కోటిరెడ్డి, కోన శ్రీను, కంచరపు శ్రీనివాస్, డీవీ తదితరులు పాల్గొని విజేతలుగా నిలిచిన వారిని అభినందించారు.



చాంపియన్‌గా నిలిచిన బాడీబిల్డర్‌లతో నిర్వాహకులు

పోలి పాడ్యమికి విశేష ఏర్పాట్లు

సింహాచలం: పోలిపాడ్యమిని పురస్కరించుకుని బుధవారం సింహాచలం దేవస్థానానికి చెందిన కొండదిగువ వరాహపుష్కరిణి వద్ద దీపాలు విడిచిపెట్టే భక్తుల సౌకర్యార్థం విశేషంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎస్. శ్రీనివాసమూర్తి తెలిపారు. వరాహ పుష్కరిణి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం రాత్రి దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఈవో పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసానికి వీడ్కోలు పలుకుతూ పుష్కరిణి వద్ద దీపాలు విడిచిపెట్టేందుకు మంగళవారం అర్ధరాత్రి నుంచి వరాహపుష్కరిణికి భారీగా భక్తులు అధికంగా తరలివస్తారన్నారు. ఈఏడాది కూడా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 16మంది దేవస్థానం గార్డులు పుష్కరిణి వద్ద విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. అలాగే 8 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. తొలిపావంచా వద్ద, వరాహ పుష్కరిణికి వెళ్లే మార్గంలోను వాహనాలను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, ఏఈవో పాలూరి నరసింగరావు, సూపరింటెండెంట్ యనమండ్ర అప్పారావు, ఏఈ రాజా పాల్గొన్నారు.



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి